క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ



అవనిగడ్డ: స్థానిక ఎంబీకే భవనంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం పోగొట్టుకున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రవితేజ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంతో ఉండాలని సింహాద్రి వారికి సూచించారు. ఎంతో శ్రమించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు. మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, వాణిజ్య విభాగం నాయకులు గార్లపాటి గోపీ, పార్టీ నాయకులు వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి

పెడన: రైతులు తమ పంటలను సారవంతంగా చేసుకుని అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని వ్యవసాయశాఖ ఏవో ఎస్.జెన్నీ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని గురువిందగుంట, చేవేంద్ర రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని సూచించారు. ఉచితంగా కంది విత్తనాలు, సేంద్రియ ఎరువులను అందజేశారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ పాలకవర్గం

మచిలీపట్నంటౌన్: ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నానితో సహా 15 మంది డైరెక్టర్లు బుధవారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో మంత్రి రవీంద్రను కలిశారు. మంత్రి వారిని అభినందించారు. రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలని కోరారు.

కిట్లు పంపిణీ

గూడూరు: స్థానిక పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం పంచాయతీ కార్యదర్శి టీవీ వి.భాస్కర రావు శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. హెల్మెట్లు, హ్యాండ్ గ్లౌజులు, మాస్కులు, శానిటైజర్ ఇతర పరిశుభ్రత సామగ్రి ఈ కిట్లలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మీడియేషన్‌పై అవగాహన ర్యాలీ

బంటుమిల్లి: వివాదాల పరిష్కారానికి న్యాయస్థానాలను ఆశ్రయించే కక్షిదారులు రాజీ మార్గాల ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. మధ్యవర్తిత్వం దేశం కోసం నినాదంతో న్యాయమూర్తి ఆధ్వర్యంలో బుధవారం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానాల్లో దావాలు వేసుకున్న కక్షిదారులు 90 రోజుల్లో రాజీమార్గాల ద్వారా వివాదాలను పరిష్కారం చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాళ్ల శ్యాంబాబు, న్యాయవాదులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిండుకున్న చెరువులు

- చెరువులు నింపడంలో అధికారుల నిర్లక్ష్యం
- జీవాలకు తాగునీటి కరువు
- తీరప్రాంత ప్రజలకు తప్పని దాహం కేకలు

కోడూరు: నిండుకున్న చెరువులు.. దాహంతో అల్లాడుతున్న మూగజీవాలు.. ఇంటి అవసరాలకు కూడా దొరకని తాగునీరు.. నీటి కోసం కిలోమీటర్ల మేర ప్రయాణం.. ఇది ప్రస్తుతం కోడూరు మండలంలో ప్రజలు నీటి ఎద్దడి కారణంగా పడుతున్న కష్టాలు.

పులిగడ్డ లాకుల వద్ద 20 రోజుల కితం ప్రజాప్రతినిధులు దిగువ కాలువలకు సాగు, తాగునీటిని అట్టహాసంగా విడుదల చేశారు. నాగాయలంక, కోడూరు మండలాల్లోని పంటకాలువలకు ఈ నీటిని ఇరిగేషన్ అధికారులు మళ్లించారు. అయితే కాలువలకు విడుదల చేసిన నీటిని ముందుగా పంచాయతీల పరిధిలోని చెరువుల్లోకి అధికారులు మళ్లించి, తరువాత వ్యవసాయ అవసరాలకు వినియోగించాల్సి ఉంది. అయితే పంచాయతీల అధికారులు చెరువులకు నీటిని మళ్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రక్షిత మంచినీటి పథకాలకు చెరువులే ఆధారం..

కోడూరు మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి సుమారు 45 రక్షిత మంచినీటి, ఊర చెరువులు ఉన్నాయి. వేసవికి ముందు తాగునీటి అవసరాల కోసం కాలువలకు నీటిని విడుదల చేయగా, ఆ సమయంలో పంచాయతీల అధికారులు నీటిని చెరువుల్లో నింపారు. చెరువుల్లో నీరు నింపి నాలుగు నెలలు గడవగా, జూన్ నెలలోనే అన్ని చెరువులు నీరు లేక అడుగంటాయి. వేసవిలో ఈ చెరువుల్లోని నీటినే ప్రజలు ఇంటి అవసరాలకు వినియోగించడంతో పాటు పశువుల దాహార్తి తీర్చేందుకు వినియోగించారు. అయితే చెరువుల్లో నీరు అడుగంటి నెల రోజులు గడుస్తున్నా కూడా పంచాయతీల అధికారులు నీటిని చెరువుల్లోకి మళ్లించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు.



లింగారెడ్డిపాలెంలో నీరు లేక ఎండిపోయిన గోపాల చెరువు



ట్యాంకరు వద్ద తాగునీటికోసం తీరప్రాంత ప్రజలు

అల్లాడుతున్న మూగజీవాలు..

ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో ప్రజలకు నీటిని కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. జూన్ నుంచి ఇప్పటి వరకు సరైన వర్షం కురవకపోవడంతో భూగర్భజలాలు కూడా అడుగంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు చెరువుల్లో నీరు లేక, మరొకవైపు వర్షాలు కురవకపోవడంతో నీటి ఎద్దడి తీవ్ర మైయిందని వాపోతున్నారు. గ్రామాల్లోని చెరువుల్లో నీరు లేకపోవడంతో మూగజీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత మంచినీటి చెరువుల్లో కూడా నీరు లేకపోవడంతో తీరప్రాంత ప్రజలు దాతలు సరఫరా చేసే నీటిపైనే ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

తీరంలో దాహం కేకలు..

సముద్రతీరం ప్రాంతంలో ప్రజలకు దాహం కేకలు తప్పడం లేదు. దాతలు తాగునీటిని సరఫరా చేస్తున్నా, అవి కేవలం ఇంటికి రెండు బిందెల చొప్పునే వస్తున్నాయి. నీటి కోసం కిలోమీటర్ల మేర ప్రయాణించి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తీరప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అన్ని చెరువులకు నీటిని నింపేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

చల్లపల్లి: వరిపొలాల గట్లపై వేసుకునేందుకు 100 శాతం సబ్సిడీతో కంది విత్తనాలను బుధవారం రైతులకు అందజేశారు. మండల పరిధిలోని మంగళాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కంది విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొడాలి ఏఎంసీ చైర్మన్ తోట కనక దుర్గ, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ నాలుగు క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చాయన్నారు. వీటిని మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సులను ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందజేసి విత్తనాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ జి.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

బంటుమిల్లి: మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఒడుగు తులసీరావు, వైస్ చైర్మన్‌గా భూపతి రమేష్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, యార్డు డైరెక్టర్లు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి



మెరకనపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామంలో ఎస్‌ఐ సత్యనారాయణ మంగళవారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. తొలుత గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, మత్తు పదార్థాలు, పేకాట, కోడి పందేలు వంటి జూదాలు నిర్వహించకుండా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మండల పరిషత్ ఉపాధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు నాగప్రసాద్

నాగాయలంక: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు నాగాయలంక మండల పరిషత్ పాలకవర్గంలో ఖాళీగా ఉన్న ఒక ఉపాధ్యక్ష పదవికి బుధవారం ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.నాగరాజు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి బాధ్యతలు నిర్వర్తించగా డీఆర్‌ఓ చంద్రశేఖర్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. ఎన్నిక ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. తొలుత పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీటీసీ సభ్యులతో 11గంటలకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ అధికారి ఎన్నిక జరిపారు. నాగ ప్రసాద్ ఒక్కరే నామినేషన్ వేశారు. పోటీ లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన నాగప్రసాద్‌కు డీఆర్వో సమక్షంలో పి.ఓ సంబంధిత ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ప్రసాద్‌కు ధ్రువీకరణపత్రం అందిస్తున్న పి.ఓ, డీఆర్‌ఓ

మండల పరిషత్ పాలకవర్గంలో ఇద్దరు ఉపాధ్యక్షులు ఉండగా వారిలో ఒకరైన భావదేవరపల్లి ఎంపీటీసీ సభ్యుడు పరిశె అమ్మన్న(వైఎస్సార్‌సీపీ) మరణించడంతో ప్రస్తుతం ఆ స్థానం భర్తీ చేయడానికి ఎన్నికల కమిషన్ ఈ ఎన్నిక జరిపింది. ఎంపీపీ భోగాది రాఘవరాణి, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్ళూరి విద్యాశ్రీ పర్యవేక్షణలో సీఐ పి.యువకుమార్, ఎస్.ఐలు కలిదిండి రాజేష్ (నాగాయలంక), శ్రీనివాసరావు(అవనిగడ్డ) బందోబస్తు నిర్వహించారు.

సాగునీటి కొరత లేకుండా చూడాలి

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన ఎంపీడీఓ సుధాప్రవీణ్ నిర్వహణలో బుధవారం జరిగింది. వివిధ శాఖల అధికారుల సమీక్షపై ఆమె మాట్లాడుతూ మండలంలో వ్యసాయ పనులు ఆరంభించిన నేపథ్యంలో ఎరువులు అధిక ధరలకు విక్రయించకుండా చూడాలని, సాగునీటి కొరత లేకుండా రైతులకు సహకరిస్తూ అండగా ఉండాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి ఏ.సంజీవరావు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 76 క్వింటాళ్ల పిల్లి పెసర, 71 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశామన్నారు. ఆర్ఎస్‌కేల ద్వారా 585 క్వింటాళ్ల బీపీటీ 5204 విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పీఎంఎఫ్‌బీవై క్రాప్ ఇన్సూరెన్స్ కింద వరి పంటకు ఆగస్టు 15లోపు రైతులు ఎకరాకు రూ.830 చొప్పున ప్రీమియం సచివాలయం, పీఏసీఎస్, సీఎస్‌సీ, పోస్టాఫీసులలో చెల్లించాలన్నారు. దీనివలన విపత్తులలో పంట నష్టం జరిగితే రూ.41500 నష్టపరిహారం అందుతుందన్నారు. అంతకు ముందు ఎంపీటీసీల గౌరవ వేతనం ఇవ్వనందుకు నిరసన ప్రకటించి నలుగురు టీడీపీ సభ్యులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. డెప్యూటీ తహసీల్దార్ మండలి కేశవి, ఈఓపీఆర్డీ జరుగు పవన్‌కుమార్, వివిధ శాఖల మండల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్ (వైఎస్సార్ సీపీ)ను ఎంపీపీ రాఘవరాణి, సహచర ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అభినందిస్తూ సన్మానించారు.



ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నాగప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, సభ్యులు

మొక్కలు నాటిన అధ్యాపకులు

పెడన: స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఏక్ పెడ్ మాకే నామ్ పేరుతో 'ఒక మొక్క నాటండి' అనే కార్యక్రమం చేపట్టారు. తొలుత విద్యార్థులకు నాలెడ్జ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. అనంతరం కాలేజీ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మీడియా అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కృష్ణా జిల్లా వైస్ ప్రెసిడెంట్ పుట్టి కృష్ణప్రసాద్, ఎకానమిక్స్ లెక్చరర్ రాజ్యలక్ష్మి, జూనియర్ లెక్చరర్ ఎంవీ గంగాధర్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లను అందించారు. చివరగా ఏక్ పెడ్ మాకే నామ్ ప్రతిజ్ఞను విద్యార్థులతో చదివించారు.



కళాశాల ఆవరణలో మొక్కలను నాటుతున్న కృష్ణప్రసాద్, రాజ్యలక్ష్మి, గంగాధర్ తదితరులు

ఐపీ పెట్టిన ఉపాధ్యాయుడికి విధులా?

విస్మయం వ్యక్తంచేస్తున్న బాధితులు



ఘంటసాలలో మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

ఘంటసాల: రియల్ ఎస్టేట్, చిట్టీల పేరుతో కోట్లాది రూపాయలు మోసం చేసి సస్పెండయిన ఉపాధ్యాయుడికి విద్యాశాఖాధికారులు పోస్టింగ్ ఇవ్వడంపై పలువురు బాధితులు విస్మయం వ్యక్తం చేశారు. ఘంటసాల గ్రామానికి చెందిన బాధితులు వి.అహోబలరావు గృహంలో బుధవారం విలేకరులకు తమ గోడు వినిపించారు. వారి కథనం మేరకు.. ఘంటసాల గ్రామానికి చెందిన జి.శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే రియల్ ఎస్టేట్, చిట్టీ పాటలు వేసే వారు. సుమారు 200 మందికి అతను రూ.9 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ఏడాది క్రితం అందర్నీ మోసం చేసి గ్రామం విడచి వెళ్లపోయిన శ్రీనివాసరావు ఐపీ దాఖలు చేశారు. దీంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా 2024 మార్చిలో అప్పటి కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. బాధితులమంతా విద్యాశాఖాధికారులు, పోలీసులు, ఇతర ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యను చెప్పుకోవడంతో పాటు పలు అర్జీలు కూడా ఇచ్చారు. ఏడాది తర్వాత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఘంటసాల మండలంలోనే ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరడంతో బాధితులంతా అవాక్కయ్యారు. సమాచార చట్టం కింద వివరాలు సేకరించగా శ్రీనివాసరావు ఉన్నతాధికారులను, కోర్టులను కూడా తప్పుదోవ పట్టించినట్లు అర్థమైంది. దీనిపై సుమారు నెలా15 రోజుల క్రితం నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, విద్యాశాఖ సెక్రటరీ, డైరెక్టర్లకు, విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు, డీఈఓకు ఈ-మెయిల్, రిజిస్టర్ పోస్టులు, అర్జీల ద్వారా తమ బాధను విన్నవించినా తమకు ఎలాంటి న్యాయం జరగడం లేదని వాపోయారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమను మోసం చేసిన ఉపాధ్యాయుడిని తక్షణమే సస్పెండ్ చేసి, న్యాయం చేయాలని కోరారు. దోనేపూడి అహోబలరావు, వేమూరి వెంకటేశ్వరరావు, కాకరవర్తి కేశవ, తలశిల రంగారావు, పోతన వెంకటేశ్వరరావు, వడ్లమూడి ప్రసాదరావు, గొరిపర్తి రాజేష్, గొర్రెపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు



చల్లపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలైన ఘటన పులిగడ్డ- విజయవాడ కరకట్టపై బుధవారం సాయంత్రం నడకుదురు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వల్లూరుపాలెంకు చెందిన నాగబాబు, నాగజ్యోతి దంపతులు ఇద్దరు పిల్లల మొక్కులు తీర్చేందుకు ద్విచక్ర వాహనంపై మోపిదేవి వచ్చారు. తిరుగు ప్రయాణంలో నడకుదురు వద్దకు రాగానే ఎదురుగా తండ్రీకుమార్తె వస్తున్న మరొక బైక్ ఢీకొన్నాయి. నాగబాబు పెద్దకుమారుడు శివతేజ కాలుకు బలమైన గాయం కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. శివతేజను విజయవాడ తరలించగా నాగబాబు, నాగజ్యోతిలను చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి

తాడేపల్లి(ఘంటసాల): మండలంలోని తాడేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండేటి ప్రసాద్ (74) మంగళవారం రాత్రి స్వగృహంలో ఆకస్మికంగా మరణించారు. బుధవారం ఉదయం సమాచారం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కొండేటి ప్రసాద్ 2006 నుంచి 2011 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్‌గా పని చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఆరోగ్యంగా ఉంటున్న ప్రసాద్ ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు ప్రసాద్‌కు ముగ్గురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

పేద కుటుంబాల గుర్తింపునకు గ్రామ సభ

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దిడ్ల జాన కీరాంబాబు, మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, గ్రామ కార్యదర్శి చందన దేవినాగరోజావతి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త లాకుల ఏర్పాటు



నాడు: నిమ్మగడ్డ లాకుల వద్ద పాడైన లాక్ చాంబర్



నేడు: నిమ్మగడ్డ వద్ద పాతగేట్ల స్థానంలో కొత్తగేట్లు

సాక్షి స్పందన

చల్లపల్లి: కేఈబీ కెనాల్‌పై నిమ్మగడ్డ, వల్లూరుపాలెం ప్రాంతాల్లో లాకులకు పాడైపోయిన గేట్ల స్థానంలో రూ.24 లక్షల వ్యయంతో అధికారులు కొత్త గేట్లు ఏర్పాటు చేశారు. నిమ్మగడ్డ, వల్లూరుపాలెం గ్రామాల వద్ద లాక్ చాంబర్ల గేట్లు పూర్తిగా పాడైపోయి పనికిరాకుండా ఉండటంతో 'లాక్ వేసేదెలా? అనే శీర్షికతో మే 26వ తేదీన సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఒక్కొక్క గేటుకు రూ.12 లక్షలు చొప్పున రెండు ప్రాంతాల్లోని రెండు గేట్లకు కలిపి రూ.24 లక్షల వ్యయంతో లాక్ చాంబర్లకు కొత్తగేట్లు అమర్చారు. జూన్ 15వ తేదీన కేఈబీ కెనాల్లో సాగునీరు విడుదల చేశారు. అయితే అప్పటికి లాక్ గేట్లు తయారుకాకపోవటంతో ఆ ప్రాంతంలో నీటి ప్రవాహం ముందుకు సాగకుండా మట్టితో కట్టలు వేశారు. తాజాగా పాత గేట్లను తొలగించి కొత్తగేట్లు అమర్చి ఉపయోగంలోకి తెచ్చారు. విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చి త్వరితగతిన లాకు గేట్లు ఏర్పాటు చేసేందుకు కృషిచేసిన సాక్షి పత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.